
సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.8,111

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో పత్తి క్వింటాల్‌కు రూ.8,111 పలికింది. కనిష్టంగా రూ.7వేలు, నగటున రూ.8,061గా నిర్ణయించినట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ తెలిపారు.



పెరిగిన వరి సాగు

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రైతులు వరిసాగు వైపే దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/17.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉదయం చల్లగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీసీ క్రీమిలేయర్ ఎత్తివేయాలి



పెద్దపల్లికి చేరిన బీసీనాయకులు

పెద్దపల్లిరూరల్: జనాభా ప్రకారం బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలని, బీసీలకు క్రీమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన పలు కార్యక్రమాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలకు హాజరై శనివారం పెద్దపల్లికి చేరుకున్న సందర్భంగా మాట్లాడారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా బీసీలంతా ఏకమై చట్టసభల్లో రిజర్వేషన్లు సాధిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రులను కలిసి సమస్యను విన్నవించినట్లు వివరించారు. నాయకులు సతీశ్, నరేందర్, శ్రీనివాస్, సంపత్, రమణ, సాగర్, శ్యాం, దిలీప్, స్వరూప తదితరులున్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ వర్ధంతి



నివాళ్లర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: దీన్‌దయాళ్ 55వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్, నాయకులు గాండ్ల ధర్మపురి, రాచకొండ కోటేశ్వర్లు, మిట్టపల్లి సతీశ్‌కుమార్, కర్రావుల డేవిడ్‌రాజు, మంచికట్ల భిక్షపతి, గుర్రాల సందీప్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే ప్రధాన చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మామిడి రాజేశ్, మహావాది రామన్న, గోగుల రవీందర్‌రెడ్డి, తాటిపర్తి శ్రీధర్‌రావు, బూడిద రమేశ్, నవీన్ గౌడ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో అనాథలుగా..

అయినవారు అందరూ ఉన్నా.. పట్టించుకునేవారు లేక

సండే స్పెషల్



"నాపేరు సునీత. వయసు 68 ఏళ్లు. రోడ్డుపై ఒంటరిగా ఉన్న నన్ను నాలుగేళ్ల క్రితం రామగుండం కార్పొరేటర్ ఎండీ. ముస్తాఫా పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర ఆశ్రమంలో చేర్పించాడు. బంధువులు ఎందరో ఉన్నా.. ఆదరణ లేక ఇక్కడే ఉంటున్నా. కాళ్లనొప్పులు, ఆస్తమా సమస్యలతో బాధపడుతున్నా. ఆశ్రమ నిర్వాహకుడు నాకు మూడుపూటల భోజనం పెట్టి కొడుకులా చూసుకుంటున్నాడు.



నా పేరు వైద్యుల మల్లారెడ్డి. మా ఆవిడ పేరు రాజవ్వ. సొంతూరు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్. వ్యవసాయం చేసుకుంటూ బతికేటోళ్లం. మంచిగా ఆస్తి సంపాదించిన. కొడుకులు బాసటగా ఉంటారనుకున్నా. కానీ ఉన్న ఆస్తిని వాళ్లపేరున చేయించుకున్నారు. మా ఇద్దరిని వెళ్లగొట్టారు. ఐదేళ్లుగా గోదావరిఖనిలోని శ్రీధర్మశాస్త్ర వృద్ధుల సేవా ఆశ్రమంలో ఉంటున్నాం. మాకు కొడుకులు, బిడ్డలు.. వాళ్ల పిల్లలతో హాయిగా ఆడుకోవాలని, కలిసిఉండాలని అనిపిస్తుంది. కానీ కన్న రక్తం మమ్మల్ని గెంటేశాక దినమొక నరకంగా బతుకుతున్నాం.



నాపేరు శ్రీపతి లక్ష్మి. మాది రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకెపల్లి. భర్తకు పక్షవాతం వచ్చి చనిపోయిండు. నాకు ముగ్గురు కొడుకులు.. ముగ్గురు కూతుళ్లు. ఏం లాభం.. బుక్కెడు అన్నం పెట్టేందుకు ఎవరికీ చేతులు రావడం లేదు. అందరూ కలిసి ఇంట్లోంచి వెళ్లగొట్టారు. తెలిసినోళ్లు గోదావరిఖనిలోని ఆశ్రమంలో ఉంచారు. కొన్నేళ్లుగా ఇక్కడే బతుకుతున్న. కడుపున పుట్టిన ఆరుగురు ఉన్నా అనాథగా ఉంటున్న.



జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామానికి చెందిన కట్కూరి రాజయ్య, రాజవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఎవరికి వారు బతుకుతున్నారు. కొడుకులు ముగ్గురూ వంతులవారీగా తల్లిదండ్రుల బాగోగులు చూస్తున్నారు. అయితే.. వృద్ధాప్యానికి తోడు రాజయ్య దంపతులను అనారోగ్య సమస్యలు వెంటాడాయి. ఆస్పత్రిలో చూపించుకునేంత స్థోమత లేదు. కొడుకులను ఇబ్బంది పెట్టేందుకు ఇష్టం లేదు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 10వ తేదీన దంపతులు ఇద్దరూ సూసైడ్ నోటు రాసి ఆత్మహత్య చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని.. నోటులో రాశారు.

నవమాసాలు మోసి పురిటినొప్పులను ఆనందంగా భరిస్తుంది తల్లి. తన రక్తాన్ని పాలుగా మలిచి ఆకలిని తీరుస్తుంది. బిడ్డకు చిన్న ఆపదొచ్చినా.. కన్నపేగు విలవిల్లాడుతుంది.

బుడిబుడి అడుగులు వేసే సమయంలో వెన్నంటే ఉంటాడు నాన్న. జీవితంలో తప్పటడుగులు వేయకుండా దారి చూపుతాడు.

పిల్లలు భవిష్యత్‌లో ఇబ్బంది పడొద్దని అన్ని విధాలా సమకూరుస్తారు తల్లిదండ్రులు. సమాజంలో దర్జాగా తిరిగేలా చేస్తారు. పిల్లలను ఉన్నతంగా స్థిరపరిచేందుకు జీవితాన్నే దారబోస్తారు. అయితే.. రెక్కలొచ్చిన పక్షుల్లాగా.. కొందరు పిల్లలు మలివయసులో తల్లిదండ్రులను అనాథలను చేస్తున్నారు. తమకు భారంగా ఉంటున్నారని ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. వృద్ధాప్యంలో పిల్లలకు భారం కావొద్దని కొందరు తనువు చాలిస్తున్నారు.

- సాక్షి, కరీంనగర్ డెస్క్

- తోడులేక.. నీడలేక వృద్ధుల పాట్లు
- చివరి అంకంలో ఆశ్రమాల్లో బతుకీడుస్తూ..
- పిల్లలకు భారంగా ఉండలేక.. బాధను దిగమింగలేక..
- బలవన్మరణానికి పాల్పడుతున్న మరికొందరు

మారుతున్న కాలం..

ఒకప్పుడు కుటుంబం అంటే తల్లి,తండ్రి.. కొడుకు, కోడలు.. పిల్లలుగా భావించేవారు. ఇప్పుడు పెళ్లయిన కొన్నాళ్లకే తల్లిదండ్రులను దూరం పెడుతున్నారు. వారి నుంచి సంక్రమించే ఆస్తిపాస్తులు దక్కించుకుని తల్లిదండ్రులను కూడా పంచుకుంటున్న ఘటనలు తరుచూ కళ్లముందు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఆస్తిని దక్కించుకుని తల్లిదండ్రులను దూరం కొడుతున్నారు. మరికొందరైతే ఉద్యోగం రీత్యా దంపతులు ఇద్దరూ బిజీగా ఉంటున్నామని తల్లిదండ్రులను ఆశ్రమాల్లో అప్పగించేస్తున్నారు. వారికి నెలకు కావాల్సిన భత్యం కూడా నిర్వాహకులకు అందిస్తున్న వైనం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు వృద్ధాశ్రమాల్లో కనిపిస్తోంది.

ఆదరణ లేక.. ఆరోగ్యం సహకరించక..

పిల్లలు జీవితంలో స్థిరపడిన తరువాత తల్లిదండ్రులు కోరుకునేది వారి నుంచి ప్రేమను మాత్రమే. అయితే ఆ ప్రేమను పొందలేక.. ఆదరణ లభించక చాలా మంది వృద్ధులు కుమిలిపోతున్నారు. మలి వయసులో వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో కొడుకులకు భారం కావొద్దని జగిత్యాల జిల్లాలో ఓ వృద్ధ జంట ఆత్మహత్య చేసుకోవడం విషాదం నింపింది. కొడుకులకు లక్షల ఆస్తిని పంచి ఇచ్చినా బుక్కెడు బువ్వ పెట్టకుండా తండ్రిని గ్రామపంచాయతీ వద్ద వదిలివెళ్లిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో చోటుచేసుకుంది. గతేడాది సెప్టెంబరు 13న వేములవాడ రూరల్ మండలం పట్టెంల గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారిని కలిసి తన కొడుకు పైసలిస్తలేడని ఎట్ల బతకాలి అని ఫిర్యాదు చేశాడు. ఇవే కాదు.. జిల్లాలో వెలుగులోకి రాని ఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్నాయి. తమకొడుకులు పట్టించుకోవడం లేదని నిత్యం ఏదో ఒక పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు పండుటాకులు. అనారోగ్యం.. ఆర్థిక, కుటుంబ సమస్యలు... పిల్లలు చేరదీయక పోవడంతో రెండేళ్ల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలో 120 మందికి పైగా వృద్ధులు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.



వృద్ధుల రక్షణ చట్టం

2007లో 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ చట్టం'ను పార్లమెంట్ ఆమోదించింది. తల్లిదండ్రుల విషయంలో వారి పిల్లలు వ్యతిరేక ధోరణితో అనుసరిస్తున్న వైఖరికి ఈ చట్టం రక్షణగా నిలుస్తోంది. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేసినవారికి 3నెలల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తారు. తల్లిదండ్రుల పోషణ, వైద్యానికి అయ్యే ఖర్చులు కూడా చెల్లించాలని చట్టం నిర్దేశిస్తోంది. తల్లిదండ్రులకు ఏమైనా స్థిరాస్తులు ఉంటే వాటిని పొందడానికి కూడా వీలులేకుండా వారసులను అనర్హులుగా నిర్ణయించవచ్చు. ప్రతీ జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అభాగ్యులైన వృద్ధ దంపతులకు అండగా నిలిచే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చట్టం చెబుతోంది. ట్రిబ్యునల్ నిర్ణయం మీద అప్పీలు ఉండదు. కేసు పెండింగ్‌లో ఉన్నకాలంలో నెలసరి భత్యం కూడా చెల్లించాలి. విచారణ చేపట్టే ముందు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సయోధ్య చేపట్టాలి. ఈ చట్టం కింద తాత, అమ్మమ్మ, నాయనమ్మల పోషణ కూడా కొడుకులు, మనవలు, దత్తపుత్రుల బాధ్యత. అయితే మైనర్లకు మాత్రం ఈ చట్టం మినహాయింపు ఇచ్చింది.

- **40** కరీంనగర్‌లోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో ప్రస్తుతం ఉంటున్న వారు.
- **45** కరీంనగర్‌లోని మానేరు డ్యాం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న వాసవి వృద్ధుల ఆశ్రమంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నవారు.
- **15** కరీంనగర్‌లోని అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారి సంఖ్య. ఇదీ నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయం సమీపంలో ఉంటుంది.
- **60** కరీంనగర్ రూరల్ మండలం పరిధిలోని ఇరుకుల్ల గ్రామంలో ఉన్న పద్మనాయక వృద్ధుల ఆశ్రమంలో ఉన్నవారి సంఖ్య.
- **14** సిరిసిల్ల పరిధిలోని రగుడుశివారులో టీటీ భూంరావు ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల సంఖ్య. ఇందులో 8మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు.
- **21** తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లగిశెట్టి విశ్వనాథం ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులు. ఇందులో పదిహేను మంది మహిళలు.. ఆరుగురు పురుషులు ప్రస్తుతం ఉంటున్నారు.
- **19** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో ఉంటున్న వారు.
- **14** పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని పట్టణంలో శ్రీధర్మశాస్త్ర ఆశ్రమం 30మందితో 2012లో ప్రారంభం అయ్యింది. ప్రస్తుతం 14మంది వృద్ధులు ఉంటున్నారు.

సింగరేణి వైద్య కళాశాలగా నామకరణం చేయాలి

- కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా కేటాయించాలి
- లింగాపూర్ లిఫ్ట్ ద్వారా పెద్ద చెరువును నింపాలి
- అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని: సింగరేణి నిధులతో రామగుండంలో ప్రారంభమైన మెడికల్ కళాశాలకు సింగరేణి సైన్స్ మెడికల్ కళాశాలగా నామకరణం చేయాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో సింగరేణి కార్మికులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి నిండుకుండలా మారిందని, లింగాపూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి పెద్ద చెరువును నింపాలని సూచించారు. దానిద్వారా రాయదండి, పాములపేట, లింగపూర్, పెద్దంపేట గ్రామాల్లోని నాలుగు వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు.

కార్మిక కుటుంబాలకు మిషన్‌భగీరథ నీరందించాలి

సింగరేణిలోని కార్మిక కుటుంబాలకు మిషన్ భగీరథ నీటిని అందించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. కొంతకాలంగా సింగరేణి క్వార్టర్లు ఖాళీగా ఉంటున్నాయని, వాటిని శాశ్వతంగా కార్మికులకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యైటింక్లయిన్‌కాలనీలోని తారక రామానగర్, భాస్కర్‌రావునగర్‌లో కొన్నేళ్లుగా సింగరేణి స్థలాల్లో నివాసముంటున్న ప్రజలకు జీవో 58, 76 ప్రకారం పట్టాలు ఇప్పించాలని కోరారు. కుందనపల్లిలోని ఎన్టీపీసీ యాష్ పాండ్ బాధితులను ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. రామగుండంలో మైనింగ్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో జూనియర్ కళాశాలలు, జనగామ త్రిలింగేశ్వర రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

శాసనమండలిలో మనోళ్లకు చోటు

- చీఫ్‌విప్‌గా భానుప్రసాద్.. విప్‌గా కౌశిక్



చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్ రావు



విప్ పాడి కౌశిక్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా శాసన మండలికి ఎన్నికైన తానిపర్తి భానుప్రసాద్‌రావును చీఫ్‌విప్‌గా, ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డిని విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

- భానుప్రసాద్‌రావు 2009లో కాంగ్రెస్ నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం టీఆర్‌ఎస్ పార్టీలో చేరి 2014లో మరోసారి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. ముచ్చటగా మూడోసారి మళ్లీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా 2021 డిసెంబర్ 14న జరిగిన ఎన్నికల్లో గెలుపొందారు. గతంలో భానుప్రసాద్‌రావు శాసనమండలి విప్‌గా పని చేశారు.
- శాసనమండలి విప్‌గా ఎంపికైన పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం కాంగ్రెస్ క్యాడర్‌తో సహా టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కౌశిక్‌రెడ్డిని మొదటగా గవర్నర్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ప్రభుత్వం నామినేటెడ్ చేయగా గవర్నర్ నిరాకరించారు. దీంతో ఆయనను ఎమ్మెల్యేల కోటా కింద శాసనమండలికి పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. తాజాగా శాసనమండలి విప్‌గా కేబినెట్ ర్యాంకు ను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీని కరీంనగర్ జిల్లాలో తిరుగులేని శక్తిగా తయారు చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

జిల్లా కోర్టులో 1,398 కేసుల పరిష్కారం

- రూ.69,58,114 పరిహారం చెల్లింపు
- రాజీమార్గమే మేలు
- జిల్లా జడ్జి నాగరాజు



మాట్లాడుతున్న జిల్లాజడ్జి నాగరాజు



గోదావరిఖనిలోని కోర్టులో లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జిలు

పెద్దపల్లిరూరల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా జిల్లాకేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా 1,398 కేసులు పరిష్కారమయ్యాయని, కక్షిదారులకు రూ.69,58,114 పరిహారం చెల్లించారని జిల్లా జడ్జి నాగరాజు తెలిపారు. 1356 క్రిమినల్ కేసులు, 22 సివిల్ కేసులు, 20బ్యాంకు, టెలికం కేసులు ఉన్నాయని తెలిపారు. రాజీకొస్తే ఇరువర్గాలూ గెలిచినట్లేనని పేర్కొన్నారు. కార్యదర్శి అర్జున్, జూనియర్ సివిల్ జడ్జి రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్‌బాబు, న్యాయవాదులు, బ్యాంకు, టెలికాం, పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

గోదావరిఖని: లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి టీఎస్‌పీ.భార్గవి, అదనపు మేజిస్ట్రేట్ దుర్గం గణేశ్ అన్నారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మాట్లాడారు. కక్షలు, కార్పణ్యాలతో సాధించేదేమీ లేదన్నారు. లోక్‌అదాలత్‌లో రాజీపడిన కేసులకు అప్పీళ్లకు అవకాశం లేదన్నారు. కోర్టు పరిధిలో 961 కేసులు పరిష్కరించారు. ప్లీడర్ నరేశ్, ఏజీపీ చక్రపాణి, లోక్‌అదాలత్ సభ్యులు బాన అనురాధ, గుర్రాల రాజేందర్, పులిపాక ప్రవీణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు సీహెచ్.శైలజ, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, సీఐలు వేణుగోపాల్, చంద్రశేఖర్, ఎస్సై సంతోష్‌కుమార్, శరణ్య, జీవన్ పాల్గొన్నారు.

మంథనిలో పాల్గొన్న సబ్ జడ్జి భారతి

మంథని: మంథని కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు సబ్ జడ్జి భారతి. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ జడ్జి శ్రీధర్, అడిషనల్ జడ్జి స్వాతి, న్యాయవాదులు, తదితరులు ఉన్నారు.

నూతన ఓసీపీలతో గ్రామాలు కనుమరుగు



దళిత మహిళలతో మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

- ఉద్యోగాలు రాక విద్యావంతుల మనోవేదన
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్

రామగుండం: నూతన ఓపెన్ కాస్టుల ఏర్పాటుతో అనేక గ్రామాలు కనుమరుగు అవుతున్నాయని, ఉద్యోగాలు రాకపోవడంతో విద్యావంతులు మనోవేదనకు గురవుతున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శనివారం అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్, రాయదండి, పెద్దంపేట గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడోయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అందరినీ కలిశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 108సేవలు, రేషన్ షాపుల్లో ఎనిమిది రకాల నిత్యావసరాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను అందించిందని గుర్తు చేశారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకొస్తే ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సహాయం అందిస్తామన్నారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ కుటుంబమే బంగారుమయమైందన్నారు. మాజీ ఎంపీపీ మహంకాళి స్వామి, జిల్లా నాయకుడు పెండ్యాల మహేశ్, జగన్‌మోహన్‌రావు, అర్కుటి రాజమల్లుయాదవ్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, బర్పటి శ్రీనివాస్, గజ్జెల నాగరాజు, కోల రామ్మూర్తిగౌడ్, అనితా చౌదరి, సూర తార, గాదె సుధాకర్ తదితరులున్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు పర్చాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుపర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈనెల 12 నుంచి తలపెట్టిన పాదయాత్ర పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కేటగిరీ ఇవ్వాలన్నారు. జీఓ 51ను సవరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. పంచాయతీ కార్మికులకు వారాంతపు సెలవులతోపాటు పండుగలకు సెలవులు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖాజా, తిరుపతి, అశోక్, మల్లేశం, శ్రీనివాస్, సందీప్, రాజయ్య, రాజేశ్, ప్రేమ్, శ్రీకాంత్, ముస్తఫా తదితరులున్నారు.

క్లుప్తంగా

440 మందికి రూ.4.56 లక్షల జరిమానా



పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

గోదావరిఖని: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు భారీ జరిమానా విధించినట్లు గోదావరిఖని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం 440 మందిని కోర్టులో హాజరుపర్చగా వారి నుంచి రూ.4.56 లక్షలు జరిమానా రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వాహనదారులను గోదావరిఖని రెండో అడిషనల్ మేజిస్ట్రేట్ భార్గవి ముందు హాజరుపర్చగా జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అనంతరం మద్యంబాబులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్లు

సుల్తానాబాద్: పట్టణం మీదుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను వీఆర్ఏలు పట్టుకున్నారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి మట్టిని సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా.. స్థానికుల సమాచారం మేరకు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అనుమతి ఉంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా ఆయా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. కానీ.. ఇక్కడ మాత్రం అదేమీ పట్టించుకోవడం లేదు. అధికారుల నిఘా వైఫల్యంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సదయ్య (ఫైల్)

రామగిరి: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన దొంతరవేన సదయ్య (47) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెల్సిందే. అతడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈనెల మూడో తేదీన కమాన్‌పూర్ మండలం గుండారం వద్ద బైక్ ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్ తరలించారు. మృతుడికి భార్య శంకరమ్మ, కుమార్, మహేశ్ ఉన్నారు.

కమాన్‌పూర్‌లో మరొకరు..

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి శివారులో ఈనెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోదావరిఖనికి చెందిన పబ్బ రాజేందర్(40) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సెంటనరీకాలనీ వైపు నుంచి గోదావరిఖని వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొంది. అతడిని హైదరాబాద్‌లో నిమ్స్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పెరిగిన వరి సాగు

- ఏటా పెరుగుతున్న విస్తీర్ణం
- గతేడాది కన్న ఈసారి 9,630 ఎకరాలు అధికం
- వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ

జిల్లాలో వరిసాగు ఇలా.. (ఎకరాల్లో)

ఏడాది	సాగు లక్ష్యం	సాగైంది
2021–22	1,81603	1,82,776
2022–23	1,81603	1,92,406



జిల్లాలో సాగైన వరి

సుల్తానాబాద్: ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా రైతులు వరిసాగు వైపే దృష్టి సారించారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నారు. రైతులు మాత్రం వరినే ఎంచుకున్నారు. ఈ యాసంగిలో వ్యవసాయశాఖ అధికారుల అంచనాలకు మించి వరి సాగు చేశారు.

9,630 ఎకరాలు అధికం

గత యాసంగిలో జిల్లాలో 1,81,603 ఎకరాల్లో వరి సాగైంది. అదే ఈ యాసంగిలో అది 1,92,406 ఎకరాలకు పెరిగింది. ఇప్పటికీ ఇంకా కొన్నిచోట్ల వరి నాట్లు వేస్తున్నారు. మొత్తంగా వ్యవసాయ అధికారుల అంచనాలకు మించి ఇప్పటికే 9,630 ఎకరాల వరకు అదనంగా సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే చాలాచోట్ల దోమకాటుతోపాటు పలు రకాల తెగుళ్లు వ్యాపించడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

పెరుగుదలకు కారణాలు ఇవే..

గతేడాది మాదిరిగానే ఈ ఏడాది అధిక వర్షాలు పడడంతో జిల్లాలో భూగర్భజలాలపై బెంగ లేకుండాపోయింది. అంతేగాకుండా బోర్లు, బావుల్లో పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు ఎస్సారెస్పీ నుంచి కూడా నీరు విడుదల అవుతోంది. చెరువులు, కుంటల కింద నీరు అధికంగా ఉండటంతో రైతులు ఖుషీగా ఉన్నారు. అదేస్థాయిలో పంటల సాగుకు సిద్ధమయ్యారు. విద్యుత్ సరఫరాలోనూ పెద్దగా ఇబ్బంది ఉండదనే హామీతో మరింత భరోసా కల్గింది. గత రబీ సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని మొత్తాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయడంతో అపోహలు కూడా తొలగిపోయాయి. ఫలితంగా ఈ యాసంగిలోనూ ధాన్యం కొనుగోళ్లపై నమ్మకాన్ని పెంచడంతో అత్యధిక శాతం రైతులు వరినే ఎంచుకున్నారు.

పకడ్బందీగా వివరాల నమోదు



పంటల సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. రైతులవారీగా నీటి వసతి, అందుబాటులో ఉన్న వనరులు, మార్కెటింగ్ సదుపాయం వంటి వివరాలనూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

– ఆదిరెడ్డి, డీఏవో

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అంబటి జోజిరెడ్డి

- ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి

కరీంనగర్: ఈ నెల 23 నుంచి 26వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఏఐఎఫ్‌బీ ఉత్తర తెలంగాణ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గవ్వ వంశీధర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జాతీయమహాసభలకు దేశవ్యాప్తంగా 500కు పైగా ప్రతినిధులు రానున్నట్లు తెలిపారు. మరో 25 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగనుందని అన్నారు. రాబోయే ఎన్నికలలో తెలంగాణలో 119స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో వైశ్య కార్పొరేషన్, రెడ్డికార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ చొప్పదండి కన్వీనర్ పెద్దెల్లి శేఖర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పులిమాటి సంతోశ్‌కుమార్, టీయూసీసీ జిల్లా అధ్యక్షుడు సత్యరావ్, జిల్లా కార్యదర్శి శంకర్ కురువెల్లి, పార్టీ సభ్యులు లింగమూర్తి, కిషన్‌బాబు, వినయ్, రమేశ్, హరీశ్, వాసు, రాజు, విజయ్, బుచ్చిరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

25 ఏళ్ల ముందుచూపుతో ప్రగతి బడ్జెట్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిశోర్‌రెడ్డి



మాట్లాడుతున్న కిశోర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: రాబోయే 25 ఏళ్ల దేశ భవిష్యత్తుకు ముందుచూపుతో దేశ దిశ దశ మార్చే ప్రగతి బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం కరీంనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారస్తులు, సామాజికవేత్తలు, ఆర్థిక నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈసందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుల ఆకాంక్షలను, అన్ని వర్గాల కలలను సాకారం చేసే సంక్షేమ బడ్జెట్ అని, అమృత్ కాల్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా చరిత్రాత్మకమైందన్నారు. సామాన్యుడికి ఉపశమనం కలిగించేలా పన్ను స్లాబులు ఆరు నుంచి ఐదుకు తగ్గించడమే కాకుండా పన్ను మినహాయింపు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పెంచడంతో అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. మహిళా సాధికారతకు, కర్షకుల కోసం ప్రత్యేక పథకాలు, మధ్యతరగతి ప్రజానీకం కోసం బడ్జెట్లో తీసుకున్న నిర్ణయాలు వారి ఆకాంక్షలు నెరవేర్చేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ప్రజ్ఞా భారతి జిల్లా అధ్యక్షుడు నిరంజనచారి సుదీర్ఘంగా ప్రసంగించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ కన్న కృష్ణ, జడల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు



రాజయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కెర్ల రాజయ్య(35) అనే గీతకార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వృత్తిలో భాగంగా శనివారం తాటిచెట్టు ఎక్కి కల్లు దింపేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కాలుజారి రాజయ్య కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108సాయంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన రాజయ్యకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలవాలని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి సంపత్‌కుమార్ కోరారు.

నిందితుడి అరెస్టు

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో ఇటీవల భూ తగాదాలో వల్లెపు కొమురయ్యపై అదే గ్రామానికి చెందిన మొట్లపల్లి తిరుపతి దాడి చేయగా.. శనివారం అరెస్టు చేసినట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. భూ తగాదాలో తిరుపతి బండరాయితో కొమురయ్య తలపై బాదాడు. తీవ్రంగా గాయపడిన కొమురయ్య చికిత్స పొందుతూ ఈ నెల 8న హన్మకొండలోని ఆస్పత్రిలో చనిపోయాడు. నిందితుడు తిరుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం ఉన్నారు.

పోడు భూములకు పట్టా ఆదివాసీల హక్కు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

గోదావరిఖని: పోడు భూములకు పట్టాలు ఆదివాసీల హక్కు అని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామంటూ కుట్ర చేస్తోందన్నారు. పోడుభూములను గిరిజనులకు భిక్ష వేస్తున్నామంటూ ఆదివాసీలను అవమానానికి గురిచేస్తోందన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని నీరుగార్చేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపన్యాసం ఉందని, అటవీభూవిపై పూర్తి హక్కులు ఉన్న ఆదివాసీలను అవమానపరిచేలా ప్రజాప్రతినిధుల సంతకాలు ఉండాలని కుట్ర చేయడం సరికాదని పేర్కొన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేవలం 45 శాతం పేరిట కొద్దిమందికే చెల్లించి చేతులు దులుపుకొంటే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సూర్యం, రామయ్య, నంది రామయ్య, సత్యనారాయణరెడ్డి, జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, కృష్ణ, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, పెండ్యాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ కార్మికుల వేతనాలు పెంచకుంటే సమ్మె

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఓబీ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచకుంటే సింగరేణిలో సమ్మె తప్పదని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కౌశిక హరి అధ్యక్షతన గోదావరిఖనిలో రామగుండం రీజియన్‌లోని పలు ఓబీల్లో పనిచేస్తున్న కార్మికుల సాధారణ సమావేశం నిర్వహించారు. ఏళ్ల తరబడి ప్రైవేట్ ఓబీల్లో వేలాది మంది కాంట్రాక్టు కార్మికులు, డ్రైవర్లు, హెల్పర్లు, బ్లాస్టింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారని, వీరికి వేతనాలు, ఇతర హక్కులు అందడం లేదన్నారు. పనిభారం మోపి ప్రమాదాలకు కారణం అవుతున్నారని, యాజమాన్యం నిర్లక్ష్యంతో నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. వేతనాలు పెంచాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి రెండుసార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 13 నుంచి 15 వరకు అన్ని ఓబీల్లో కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ గేటుమీటింగ్‌లు ఉంటాయని, యాజమాన్యం వేతనాలు పెంచకుంటే ఈనెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. నాయకులు కెంగర్ల మల్లయ్య, వేల్పుల కుమారస్వామి, తోకల రమేశ్, ముస్త్యాల సర్పంచ్ రామగిరి లావణ్య, నాగరాజు, రామన్న, శశి కుమార్, రవి, నవీన్, పీసీ.పటేల్, ఆర్‌వీఆర్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని, సింగరేణి సంస్థకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. శనివారం తన కార్యాలయంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. క్వాలిఫై అయిన అభ్యర్థులకు స్పెషల్ ప్యాకేజీ ద్వారా స్టడీమెటీరియల్ అందించారని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో ఏకాగ్రత అవసరమని, చదువుపై దృష్టి సారించి ఏప్రిల్‌లో జరిగే మెయిన్స్‌లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రావణ్‌కుమార్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కేఎస్.నందు, సేవా కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ సారంగపాణి, సేవా కో–ఆర్డినేటర్ మేడి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం.. రూ.4లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన సామగ్రి

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని మడిపల్లిగ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దుగోడమిషన్, దర్వాజ, తలుపులు, కర్రసామగ్రి శుక్రవారం దగ్ధమైంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దోజు వీరన్న, అతని కొడుకు రాజేశ్ గ్రామంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పనిముగించుకుని కర్ర, సామగ్రిని ఇంటిపక్కన గల షెడ్డులో భద్రపరిచారు. అర్ధరాత్రి సమయంలో షెడ్‌లో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వీరన్నకు సమాచారం ఇచ్చారు. మంటలు అదుపుకాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షల కర్ర, సామగ్రి కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ముగల పరశురాములు, ఎగ్గెటి హరీశ్ కోరారు.

జెన్‌పాక్ట్ సంస్థకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు బి.గ్రీష్మ, బి.ఆశ్రిత, రహత్ ఉన్నీసా బేగం, షైకానిమ్రాలు ఇటీవల టాస్క్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో జెన్‌పాక్ట్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం విద్యార్థులను అభినందించిన ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రథమ సంవత్సరం నుంచే విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య మెలకువలు నేర్పించడం మూలంగానే ప్రతిభావంతులుగా రాణిస్తూ పలు దేశీయ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డా.బి.విజయలక్ష్మి, టాస్క్ జిల్లా సమన్వయకర్త ఎ.గంగాప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో రైతాంగం విలవిల



మాట్లాడుతున్న నగేశ్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ కరెంట్ కోతల రాష్ట్రంగా మారిందని, తరుచూ కరెంట్ కోతలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. 24గంటల నాణ్యమైన కరెంటు రైతులకు ఇస్తామని గొప్పలు చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు 6గంటల కరెంటు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కరెంట్ కోతలతో పంటలకూ సాగునీరు అందక ఎండిపోతున్నాయన్నారు. తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయస్థాయిలో పార్టీని పెట్టి ప్రజలను దగా చేస్తున్నాడని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు ఇవ్వలేని దుస్థితిలో కేసీఆర్ పాలన ఉందన్నారు. రేపటి ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రజలు తగినబుద్ధి చెపుతారని అన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శివరామ్, ఉకంటి రవీందర్‌రెడ్డి, పోలు శ్రీనివాస్, నర్సయ్య, దేవనూరి శ్రీనివాస్, సంపత్, రియాజ్ పాల్గొన్నారు.

కొత్తగట్టులో విద్యార్థినుల క్షేత్రపర్యటన



గ్రామస్తులతో విద్యార్థినులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో శనివారం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు పర్యటించారు. మనఊరు– మనచరిత్ర అంశంపై ప్రాజెక్ట్ సమన్వయకర్త సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భౌగోళిక, చరిత్ర ప్రాధాన్యతపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. జనాభా, ఓటర్లు, మౌలిక సదుపాయాలు, చెరువు, కుంటలు, గుట్టలు, వ్యవసాయ భూముల విస్తీర్ణం వంటి వివరాలు సేకరించారు. కోరెం అశోక్‌రెడ్డి ఐఏఎస్ హోదాపై అడిగి తెలుసుకున్నారు. మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ చరిత్రను అర్చకులు, గ్రామ చరిత్రను గ్రామసర్పంచ్ కిషన్‌రావు పాల్గొన్నారు.

'మదర్ థెరిస్సా' విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని సందర్శించిన విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీ డిప్లొమా విభాగం ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులు శనివారం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని సందర్శించారు. సిమెంట్ కర్మాగారం పనితీరును పరిశీలించి ఉత్పత్తి (క్రషింగ్, కిలన్‌రామిల్, సిమెంట్‌మిల్, ప్యాకింగ్ ప్లాంట్)పై తెలుసుకున్నారు. కర్మాగారం సీనియర్ ఇంజినీర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పవర్ జనరేషన్ విభాగంలో బాయిలర్, టర్బైన్ జనరేటర్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వెంట అధ్యాపకులున్నారు.

ట్రినిటిలో యోగాశిక్షణ



బీఈడీ విద్యార్థులకు యోగాశిక్షణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి బీఈడీ కాలేజీలో శనివారం యోగా శిక్షణ తరగతులు ఆరంభమయ్యాయి. ఉపాధ్యాయులు ఒత్తిళ్ల నుంచి దూరమయ్యేందుకు యోగా శిక్షణ ఉత్తమ మార్గమని ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శిక్షకులు ధ్యానం, ప్రాణయామం, సూర్య నమస్కారాలు, యోగాసానాలతో కలిగే ప్రయోజనాలను భావితరాలకు అందించాలని విద్యార్థులకు సూచించారు. యోగా గురువు రమేశ్, ప్రిన్సిపాల్ బుర్ర తిరుపతి, అధ్యాపకులు దిలీప్‌శర్మ, మధూకర్, గోపినాథ్, సుజాత, తిరుపతివర్మ తదితరులున్నారు.